సాక్షి సిద్దిపేట

ఆదివారం । 29 । సెప్టెంబర్ । 2024

చైతన్య దీపిక.. మరసం వేదిక

సండే స్పెషల్

కవులు, రచయితలను ఏకం చేసిన 'సంఘం'.. నేడు 38వ వార్షికోత్సవం

మంజీరా నది పరవళ్లలో పులకించి పోయిన పుడమితల్లి ఒడిలో మంజీరా రచయితల సంఘం (మరసం) పురుడు పోసుకుంది. వరంగల్, జగిత్యాల, సిరిసిల్ల ప్రాంతాల్లో ఎగిసిపడిన ప్రజా ఉద్యమాల ప్రభావంతో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన కొందరు కవులు, రచయితలు ప్రభావితమయ్యారు. అభ్యుదయ భావాలు కలిగిన కవులందరినీ ఒకే వేదికపై తీసుకొచ్చారు. 1986 జూలై 20న సిద్దిపేటలో పురుడుపోసుకున్న ఈ సంఘం ఆదివారం 38వ వార్షికోత్సవానికి సిద్ధమైంది. 8లో

మంజీరా రచయితల సంఘం మెదక్ జిల్లా

గజవెల్లి షణ్ముఖరాజు
సాక్షి, సిద్దిపేట

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో స్టాఫ్ నర్స్‌లుగా పని చేయడానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శాంతి తెలిపారు. ఆస్పత్రిలోని యాంటీ రెట్రో వైరల్ థెరపీ సెంటర్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేయడానికి జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి ఐదేళ్ల అనుభవం ఉన్న వారు పూర్తి వివరాలతో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆదివారం నుంచి అక్టోబర్ 3 లోపు ఆసక్తి, అర్హతలు ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాత పరీక్ష, మౌఖిక పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామని తెలిపారు. నెలకు రూ.21 వేల వేతనం చెల్లిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రతీరైతుకు రుణమాఫీ చేయాల్సిందే

కలెక్టరేట్ ఏఓకు కిసాన్ మోర్చా వినతి

సిద్దిపేటరూరల్: అర్హులైన రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయాలని కిసాన్ మోర్చా నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుమల్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ విషయమై కలెక్టరేట్ ఏఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతీ రైతుకు రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి రైతు భరోసా పెట్టుబడి అందించలేదన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, సోషల్ మీడియా

కనీస వేతనం ఇవ్వాలని ధర్నా

సిద్దిపేటరూరల్: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సందబోయిన ఎల్లయ్య, కాముని గోపాలస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతీ ఐదు సంవత్సరాలకు ఒక సారి కార్మికుల కనీస వేతనాలు జీఓ సవరించాల్సి ఉందన్నారు. ఇది అమలు కావడం లేదన్నారు. నిత్యావసరాల ధరలకు అనుగుణంగా జీతాలు మాత్రం పెంచడం లేదన్నారు. జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, వర్గల్ , ములుగు , మర్కూక్ మండలాల్లో ఉన్న పరిశ్రమల్లో కనీస వేతనం అందడం లేదని విమర్శించారు. వెంటనే కార్మికులను పర్మినెంట్ చేయాలని, వేతనాలు పెంచాలన్నారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, జిల్లా కమిటీ సభ్యుడు అమ్ముల బాల్ నర్సయ్య, నాయకులు గుర్రం నరసింహులు, దొబ్బెట రాజయ్య, వినోద, రాజయ్య, కవిత, నరసింహులు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్



భవన విజయం నాటికను ప్రదర్శించిన విద్యార్థులు

కొండపాక(గజ్వేల్): నాయకత్వ పటిమ, సంపూర్ణ మూర్తిమత్వమే విద్యా లక్ష్యమని జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్ పేర్కొన్నారు. కొండపాక బాలికల హైస్కూల్లో నో బ్యాక్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విజయం గమ్యం కాదు నిరంతర ప్రయాణమన్నారు. సమన్వయం, సహకారం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడం ద్వారా వ్యక్తి సంపూర్ణ మూర్తిమత్వం వైపునకు మళ్లించడం విద్య అసలైన లక్ష్యమన్నారు. ఆ దిశగా ముందుకు సాగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. చదువుతో పాటు సృజనాత్మకతల కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పొందించడం కోసం ప్రభుత్వం ప్రతీ నెల ఆఖరి శనివారం నో బ్యాక్ డే నిర్వహించుకునేలా మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం సముద్రాల శ్రీనివాస్, స్థానిక హెచ్‌ఎం విఠల్ నాయక్, ఉపాధ్యాయులు రఘువర్ధన్‌రెడ్డి, హారతి, రామస్వామి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, కనకయ్య, బాలమల్లయ్య, సత్యలక్ష్మి, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు కావలెను!

- పలు ప్రధాన శాఖల్లో కీలక పోస్టులు ఖాళీ
- ఇన్‌చార్జీలతో నెట్టుకొస్తున్న పరిస్థితి



సిద్దిపేట.. పలు శాఖల్లో కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పలువురికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అదనపు బాధ్యతలతో పాటు వ్యక్తిగత విధుల నడుమ పూర్తిస్థాయిలో ఆయా శాఖలపై దృష్టి సారించలేక పోతున్నారు. ఇది కాస్తా అభివృద్ధిపై ప్రభావం చూపుతోంది. ఇప్పటికైనా ఆయా శాఖలకు జిల్లా అధికారులను నియమించాలని పలువురు కోరుతున్నారు.

సాక్షి, సిద్దిపేట: జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్‌ను మే 29న సస్పెండ్ అయ్యారు.అప్పటి నుంచి ఇన్‌చార్జి వ్యవస్థే కొనసాగుతోంది. కొన్నిరోజులు ఇన్‌చార్జిగా హుస్నాబాద్ ఏడీఏ మహేశ్ కొనసాగారు. ఇటీవల జరిగిన బదిలీల్లో కరీంనగర్‌కు మహేశ్ బదిలీ అయ్యారు. అప్పటి నుంచి చేర్యాల ఏడీఏ రాధిక ఆ బాధ్యతలను చూస్తున్నారు. వ్యవసాయ సీజన్.... పూర్తి స్థాయిలో జిల్లా వ్యవసాయ అధికారి లేకపోవడంతో కొంత ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎరువుల సరఫరా తదితర అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చుసుకోవాలి. అలాగే రుణమాఫీ కానీ వారు ఫిర్యాదులు వస్తే అర్హులు అని నిర్ధారణయితే పథకం వర్తింప చేసేందుకు కృషి చేయాలి. రైతులకు పలు సూచనలు సైతం చేయాలి. ఇలా అన్నింటినీ చూసుకునేందుకు అధికారి లేకపోకపోవడంతో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

డీఎంహెచ్‌ఓ ఏరి?

మార్చి 16న సిద్దిపేట ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓగా ఖైరతాబాద్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో నల్గొండకు బదిలీ అయ్యారు. వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల, దోమల వలన వ్యాప్తి చెందే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడు వాపు, విష జ్వరాలు సంక్రమించే అవకాశం ఉంది. ప్రైవేట్ ఆస్పత్రులు, పీహెచ్‌సీ, సబ్ సెంటర్‌లను తనిఖీ చేసి వైద్యులతో పాటు సిబ్బందిని అప్రమత్తం చేయాలి. సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలిన గ్రామంలో ప్రత్యేకంగా హెల్త్ క్యాంప్‌లను ఏర్పాటు చేసి స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించాలి.. వీటిని అన్నింటినీ పర్యవేక్షించాల్సింది డీఎంహెచ్‌ఓ. అధికారి లేకపోవడంతో పూర్తిస్థాయి పర్యవేక్షణ కొరవడుతోంది.

జాబ్ మేళాలు అంతంతే

జాబ్ మేళాలు అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు ఐదు మాత్రమే ఏర్పాటు చేసి 62 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారు. రెండు సంవత్సరాలుగా సిరిసిల్ల ఉపాధి అధికారి రాఘవేందర్ సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జిగా ఉన్నారు. పూర్తిస్థాయిలో అధికారి లేకపోవడంతో వివిధ ప్రైవేట్ కంపెనీలను తీసుకు రావడంలో శ్రద్ధ చూపడం లేదని తెలుస్తోంది. అలాగే పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఈఈ లేకపోవడంతో డీఈ శ్రీనివాస్ రెడ్డే ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

అస్తవ్యస్తంగా క్రికెట్ గ్రౌండ్

జిల్లా క్రీడాయువజన అధికారి నాగేందర్ గత రెండున్నర నెలల క్రితం బదిలీ అయ్యారు. అప్పటి నుంచి డీఆర్‌డీఓ జయదేవ్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న జయశంకర్ క్రికెట్ స్టేడియం అస్తవ్యస్తంగా మారింది. గతంలో రంజీ మ్యాచ్‌లు ఆడే స్థాయిలో స్టేడియం ఉండేది. ఇప్పుడు క్రీడా శాఖకు పూర్తి స్థాయిలో అధికారి లేకపోవడంతో పట్టించుకునే నాథుడు కరువయ్యారు. స్టేడియం అంతా బురదమయంగా మారడంతో పాటు పిచ్‌పై పిచ్చి మొక్కలు మొలిచాయి. అలాగే స్విమ్మింగ్ పూల్ సైతం ఎవరూ పట్టించుకోవడం లేదు.

బీసీ వెల్ఫేర్

జూలై 31న బీసీ వెల్ఫేర్ అధికారిగా పని చేసిన సరోజ పదవీ విరమణ పొందారు. ఆగస్టు 1 నుంచి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగత్ కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మరో రెండు నెలల్లో ఆయన సైతం పదవీ విరమణ పొందనున్నారు. బీసీ హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు విద్యార్థులకు అందాలంటే పర్యవేక్షణ పెరగాలి.



అంగీకార పత్రం అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమాదేవి, చిత్రంలో ఇతర న్యాయమూర్తులు

5,328 కేసుల పరిష్కారం

లోక్‌అదాలత్ ద్వారా సత్వర న్యాయం: న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సాయిరమాదేవి

సిద్దిపేటకమాన్: క్షణికావేశంలో చేసిన తప్పులను, పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ సరైన వేదిక అని న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సిద్దిపేట న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో న్యాయమూర్తులు పలు కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ, ఒకసారి లోక్‌అదాలత్‌లో కేసు రాజీ అయితే మళ్లీ అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఉండదన్నారు. సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే బదులు రాజీ చేసుకుంటే సమయం వృథా అవ్వకుండా ఉంటుందని ఈ విషయాన్ని న్యాయవాదులు, పోలీసులు ఇరు పార్టీలకు అర్థమయ్యేలా వివరించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 5,328 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. వీటిలో 5,240 క్రిమినల్, 61 సివిల్ కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. 27 మోటారు ప్రమాద కేసుల్లో రూ.2 కోట్ల 57లక్షలు ఇప్పించినట్లు పేర్కొన్నారు. 69,718 డ్రంకెన్ డ్రైవ్, ట్రాఫిక్ ఈ చలాన్‌లు పరిష్కారమైనట్లు తెలిపారు. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ కోర్టులలో మొత్తం 10 బెంచ్‌లను ఏర్పాటు చేసి పలు కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి, న్యాయమూర్తులు మిలింద్‌కాంబ్లి, చందన, శ్రావణియాదవ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, సెక్రటరీ మంతూరి సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు వై రాజేశ్వర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, మణి, రవీందర్, పత్రి ప్రకాశ్, న్యాయసేవాధికార సంస్థ సూపరింటెండెంట్ మధుసూదన్‌రెడ్డి సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల దోపిడీ



మాట్లాడుతున్న అయిలయ్య

గత సర్కారుపై ప్రభుత్వ విప్ అయిలయ్య విమర్శలు

కొమురవెల్లి(సిద్దిపేట): గత ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల రుపాయాలు దోచుకుందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య విమర్శించారు. శనివారం మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను కార్యకర్తలు నాయకులతో కలిసి ఆయన పరిశీలించి ఆలేరు నియోజక వర్గానికి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాటి మాజీ ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర్‌రెడ్డి హయాంలో జనగామ, ఆలేరు నియోజకవర్గాలకు నీటిని అందించే ఉద్దేశంతో తపాస్‌పల్లి రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారన్నారు. ఆలేరు నియోజకవర్గానికి గత బీఆర్‌ఎస్ తాగు, సాగు నీరు అందించలేదన్నారు. కానీ మాజీ మంత్రి హరీశ్‌రావు ఈ నియోజకవర్గంపై వివక్ష చూపి తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి గోదావరి జలాలను సిద్దిపేటకు తరలించారని మండిపడ్డారు. తన నియోజకవర్గంలో ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు ఏర్పడటంతో చేర్యాల, బచ్చన్నపేట, మద్దూరు మండలాలలోని చెరువులు, కుంటలు నిండిన తర్వాత ఆలేరుకు నీటిని తరలిస్తామని, దానికి స్థానిక రైతులు సహకరించాలని కోరారు. తపాస్‌పల్లి నుంచి కొన్నె, బొందుగుల, కొలనుపాక, గుండాల వరకు నీటిని తరలించే అవకాశం ఉందన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే తమ ప్రాంతానికి నీటిని అందించలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో నీటిని విడుదల చేసిన ఇరిగేషన్ శాఖ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. చేర్యాల మాజీ జెడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, ఎంకి కనకయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సౌందర్యకు నియామకపత్రం అందిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి

స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా సౌందర్య

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట జిల్లా స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల దుబ్బాక ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సౌందర్య నియమితులయ్యారు. ఆ మేరకు శనివారం తన కార్యాలయంలో నియామక పత్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈఓ) శ్రీనివాస్‌రెడ్డి అందించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ 2024–26 వరకు స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆమె విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. దసరా సెలవుల అనంతరం జిల్లా స్థాయి అండర్–14, 17 కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ అదనపు డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

'గౌరవెల్లి'కి రూ.వెయ్యి కోట్లు ఇవ్వండి

మంత్రి ఉత్తమ్‌కు సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వినతి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న వెంకటరెడ్డి

హుస్నాబాద్‌రూరల్: శ్రీరాంసాగర్ వరద కాల్వ, గౌరవెల్లి ప్రాజెక్టుకు రూ. 1000 కోట్లు నిధులు మంజూరు చేయాలని సీపీఐ జాతీయకార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం ఈ విషయమై నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. 2004లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వరద కాల్వలకు ఇందిరా కాలువగా నామకరణం చేసి గౌరవెల్లి, గండిపెల్లి, తోటపల్లి రిజర్వాయర్లకు శంకుస్థాపన చేశారన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తోటపల్లి రిజర్వాయర్ రద్దు చేయడం, గౌరవెల్లి ప్రాజెక్టు ఎత్తు పెంచే పనులు చేపట్టడం జరిగిందన్నారు. భూ నిర్వాసితులకు పరిహారం ఇవ్వడంలో గత బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్ అన్యాయం చేశారని ఆరోపించారు. కరువు నేల మెట్ట ప్రాంతానికి సాగు నీరు అందించడానికి నిధులు మంజూరు చేసి కెనాల్స్ తవ్వించాలన్నారు. భూనిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. వచ్చే వేసవిలో ప్రాజెక్టు పనులు పూర్తి చేసి జూన్, జూలైలలో ప్రాజెక్టులోకి గోదావరి జలాలను విడుదల చేయాలని కోరినట్లు పేర్కొన్నారు.

ఆరు నెలలకోసారి వైద్యపరీక్షలు తప్పనిసరి

ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నారాయణరావు

సిద్దిపేటకమాన్: ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నారాయణరావు అన్నారు. వరల్డ్ హార్ట్ డే (ప్రపంచ హృదయ దినోత్సవం) సందర్భంగా శనివారం సిద్దిపేట అర్బన్ నాసర్‌పూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్‌సీడీ కోఆర్డినేటర్ రాజేందర్‌తో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి ఎత్తు, బరువు, బీపీ, షుగర్ తదితర వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఈ సంవత్సరం "నా ఆరోగ్యం నా హక్కు" అనే నినాదంతో వైద్యాధికారులకు, సిబ్బందికి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీపీ, షుగర్‌తో పాటు క్యాన్సర్‌కు సంబంధించిన పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. పీహెచ్‌సీ స్థాయిలో ఈ పరీక్షలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అసంక్రమిత వ్యాధులు ఎక్కువ వ్యాప్తి చెందుతున్నాయన్నారు. వీటిలో ఎక్కువ శాతం గుండె పోటు వల్ల మరణాలు అధికంగా ఉన్నాయన్నారు. ఈ మరణాలను అరికట్టాలంటే ప్రతీవ్యక్తి తన జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని సూచించారు. తృణధాన్యాలు, పీచు పదార్థాలతో కూడిన ఆహారాలను తీసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరు పొగాకు, ధూమపానానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రీకళ, డాక్టర్ సాయికిరణ్, రాజేందర్, వెంకటరమణ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ నారాయణరావు

సాహిత్యంపై జాషువా చెరగని ముద్ర

ఎంఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి



జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంఈఎఫ్ నాయకులు

గజ్వేల్: దళితజాతి అణచివేతపై ధిక్కార స్వరం గుర్రం జాషువా అని మాదిగ ఉద్యోగుల ఐక్యవేదిక(ఎంఈఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరి అన్నారు. శనివారం ఆయన జయంతి సందర్భంగా గజ్వేల్‌లో జాషువా చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ అణిచివేతలకు వ్యతిరేకంగా తన సాహిత్య పోరాటాన్ని కొనసాగించారని చెప్పారు. తనదైన శైలిలో రచనలు చేసి సాహిత్యరంగంపై ఆయన చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉప్పరిపల్లి నాగభూషణం, రాష్ట్ర కార్యదర్శి బెల్లి శ్యామల పాల్గొన్నారు.

నాణ్యమైన పౌష్టికాహారానికి ప్రాధాన్యం



శ్రీనివాసరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి

ఆహారభద్రత కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేటరూరల్: జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రజలందరికీ నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించేలా అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు జిల్లా యంత్రాంగానికి సూచించారు. శనివారం జిల్లాలోని పలు మండలాల్లోని గురుకుల పాఠశాలలను పర్యటించి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో జాతీయ ఆహార భద్రత చట్టం -2013 జిల్లాలో అమలుపై సంబంధిత శాఖల అధికారులతో కలిసి వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, సంక్షేమ హాస్టళ్లు, కేజీబీవీలు, గురుకులాలలో చదివే విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, శుభ్రమైన ఆహారం అందించేలా జిల్లా, మండలస్థాయి అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు.

ఆహార భద్రత చట్టం అమలుకు చర్యలు: కలెక్టర్

జాతీయ ఆహార భద్రత చట్టం -2013ను సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం పూర్తి చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. మెనూ ప్రకారం హాస్టళ్లలో పౌష్టిక ఆహారం అందేలా పర్యవేక్షిస్తామన్నారు. విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

టెన్త్ విద్యార్థిపై ముగ్గురు దాడి

- స్టోర్ రూమ్‌లో ఫ్యాన్లు దాచాడని ఆరోపిస్తూ గురుకులంలో గొడవ
- మంత్రి పొన్నం ఆరా
- హుస్నాబాద్‌లో ఆలస్యంగా వెలుగులోకి..



బాధిత విద్యార్థిని విచారిస్తున్న ఎస్సై మహేశ్

హుస్నాబాద్‌రూరల్: ఫ్యాన్లు స్టోర్ రూమ్‌లో దాచిపెట్టాడని ఆరోపిస్తూ టెన్త్ విద్యార్థిపై ముగ్గురు ఇంటర్ స్టూడెంట్లు దాడి చేశారు. ఈ విషయం మంత్రి వరకు వెళ్లింది. విచారించాలని ఆదేశాలిచ్చారు. దీంతో ఈ ఉదంతం వెలుగు చూసింది. బాధిత తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. హుస్నాబాద్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో టెన్త్ చదువుతున్నాడు బానోతు గౌతమ్. ఈనెల 11న రాత్రి ఓ తరగతి గదిలో ఉన్న ఫ్యాన్లు తెచ్చి స్టోర్‌రూమ్‌లో దాచాడని ఆరోపిస్తూ ముగ్గురు ఇంటర్ విద్యార్థులు దాడి చేశారు. దీంతో స్పృహ తప్పి పడిపోయాడు. ఉపాధ్యాయుడు వెంటనే తోటి విద్యార్థుల సహకారంతో హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించిన అనంతరం కరీంనగర్‌కు తరలించాలని సూచించగా 108లో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థిని పరిశీలించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించాలని రిఫర్ చేశారు. ప్రైవేటు అంబులెన్స్‌లో తీసుకెళ్లి ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చేర్పించగా గౌతమ్ చికిత్స పొందాడు. డిశ్చార్జి అయిన మూడు రోజుల తర్వాత ఇంటికి వచ్చిన బాలుడు తల్లిదండ్రులకు ఈ విషయాన్ని తెలిపాడు. దీంతో శుక్రవారం పాఠశాలకు చేరుకొని కుటుంబసభ్యులు, గిరిజనులు.. ఉపాధ్యాయులను నిలదీశారు. దాడి జరిగిన రోజే సదరు విద్యార్థులను తల్లిదండ్రులు తీసుకెళ్లారని తెలుసుకొని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి మాట్లాడుతూ, ఇంటర్ విద్యార్థులే ఫ్యాన్లు స్టోర్ రూమ్‌లో దాచిపెట్టారని ఆరోపించాడు. తాను క్లాస్ లీడర్‌నని, ఆ రూమ్ తాళం చెవి తన వద్దే ఉంటుందని చెప్పాడు. ఈ విషయంపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎవరో సమాచారం అందించారు. స్పందించిన ఆయన, ఏసీపీ సతీశ్‌కు ఫోన్ చేసి గురుకులంలో ఏం జరిగిందో ఆరా తీయమని ఆదేశించారు. ఎస్సై మహేశ్ శనివారం ఇక్కడికి చేరుకొని విచారించారు. 15 రోజుల కిందట విద్యార్థుల మధ్య గొడవ జరిగిందని ఒకరికి గాయాలైతే కరీంనగర్ హాస్పిటల్‌కు తీసుకెళ్లినట్లు చెప్పారు. సదరు గాయపడ్డ విద్యార్థి తల్లిదండ్రులు, మరికొంత మంది పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులను నిలదీసినట్లు తెలిపారు. దీంతో విద్యార్థి తండ్రి హరీశ్‌కు ఎస్‌ఐ ఫోన్ చేసి పిలిపిస్తే తన కొడుకుపై జరిగిన దాడి గురించి తెలిపారు. ఇరు పక్షాల నుంచి ఫిర్యాదులు స్వీకరించి విచారిస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు. కాగా స్టోర్‌లో ఫ్యాన్‌లు ఎలా వచ్చాయని గౌతమ్‌ను ప్రశ్నించినట్లు తెలిసింది.

క్లుప్తంగా

సైన్స్ మేళాలో ప్రతిభ



బహుమతి అందుకుంటున్న యువకులు

నర్సాపూర్‌రూరల్‌:యువజనోత్సవాల్లో మెదక్ జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన సైన్స్ మేళాలో నర్సాపూర్ మండలం నాగుపల్లి శివాజీ యూత్ సభ్యుడు నరేందర్, చందూర్ మురళీ ప్రతిభ కనబర్చి మొదటి బహుమతులు సాధించారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి దామోదర్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.

టీజీఓ జిల్లా అధ్యక్షుడిగా శ్రీరాంరెడ్డి ఎన్నిక



నూతనంగా ఎన్నికైన టీజీఓ కార్యవర్గం

సిద్దిపేట అర్బన్‌: సిద్దిపేట జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీరాంరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం సిద్దిపేటలోని హరిత హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నూతన కార్యవర్గంను ఎన్నికల అధికారి శ్యామ్, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్ రామారావు ప్రకటించారు. కార్యదర్శిగా చెన్ను శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కొండల్‌రెడ్డి, ట్రెజరర్‌గా నర్సింహా, వైస్ ప్రెసిడెంట్లుగా సురేశ్, సుజాత, జయశ్రీ, సంయుక్త కార్యదర్శులుగా రాధిక, ఖాజా, సువర్ణదేవి, కార్యాలయ కార్యదర్శిగా అయోధ్యరెడ్డి, ఆర్గనైజేషన్ సెక్రటరీగా నర్సింలు, ఈసీ మెంబర్స్‌గా భాస్కర్‌రెడ్డి, పరశురాంరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, పూర్ణచంద్, పబ్లిసిటీ సెక్రటరీగా వినయ్‌కుమార్, కల్చరల్ సెక్రటరీగా శ్రీనివాస్‌రెడ్డి, స్పోర్ట్స్ సెక్రటరీగా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, సెక్రటరీ సత్యనారాయణ, ట్రెజరర్ ఉపేందర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ జగన్‌మోహన్‌రావు, పరమేశ్వర్‌రెడ్డి, దీపరెడ్డి, ఈసీ మెంబర్ యాదగిరి పాల్గొన్నారు.

చైతన్య దీపిక.. మరసం వేదిక

కవులు, రచయితలను ఏకం చేసిన సంఘం

- ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు కవితలు, రచనలు, సదస్సులు
- మద్యపాన నిషేధంపై ఉద్యమం
- సాహితీ చరిత్రలో చెరగని ముద్ర
- ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏడు శాఖలుగా ఏర్పాటు

నేడు 38వ వార్షికోత్సవం



రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దని ర్యాలీ నిర్వహిస్తున్న రచయితలు, కవులు (ఫైల్)

సాక్షి, సిద్దిపేట : మంజీరా రచయితల సంఘం శాఖలను ఏడు పాయలుగా ఉమ్మడి మెదక్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రారంభించారు. 28 సెప్టెంబర్ 1986న మెదక్ శాఖ, 23 నవంబర్ 1986న గజ్వేల్, 11 జనవరి 1987న పటాన్‌చెరు, దుబ్బాక, సంగారెడ్డి, 1988లో జిన్నారం శాఖలను ప్రారంభించారు. ఈ సంఘాల్లో మొత్తం సుమారుగా 500లకు పైగా సభ్యులున్నారు. ఇలా ఏడు శాఖలుగా విస్తరించిన మంజీరా రచయితల సంఘం రాష్ట్రానికి చెందిన ప్రముఖ సాహిత్యకారులందరినీ ఉమ్మడి మెదక్ జిల్లాకు రప్పించి సాహిత్య సభలు, శిక్షణ తరగతులను, కవి సమ్మేళనాలు, చర్చా గోష్ఠులను నిర్వహిస్తోంది. కళాకారులు, రచయితలు, ప్రజా సంఘాలు, యువత, మహిళలు, కార్మికులను చైతన్య వంతులను చేస్తోంది.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ జయశంకర్ (ఫైల్)

ప్రజల్లో చైతన్యమే లక్ష్యంగా..



మరసం ఆధ్వర్యంలో ప్రచురించిన పుస్తకాలు

జిల్లాలో మద్యపానం నిషేధించాలని మొదట ఉద్యమించారు. సామాజిక అసమానతలు, అన్యాయాలు, అవినీతి, ప్రపంచీకరణ, గాట్ ఒప్పందం, అశ్లీల సంస్కృతీ నిర్మూలన ఇలా వివిధ అంశాలపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు పలు ఉద్యమాలను నిర్వహించింది. రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దని అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఎన్నో ప్రచురణలు చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చి తెలుగు సాహితీ చరిత్రలో చెరగని ముద్ర వేసుకుంది. వివాహ వ్యవస్థలో మార్పును తీసుకురావాలనే సంకల్పంతో వరకట్న రహితంగా వివాహాలు జరిపించారు. అందులో భాగంగా దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి సుజాతల వివాహం చేయించారు. ఇలా జిల్లాలో పలువురి వివాహాలు జరిపించి నూతన ఒరవడికి నాంది పలికింది. వరకట్న వివాహాల సంస్కృతికి భిన్నంగా ఆదర్శ వివాహాలు సైతం చేసింది. సమకాలీన సమస్యలపై సభలను నిర్వహించారు. రచయితలు, కవులు రాసి వందల పుస్తకాలను మరసం ద్వారా ప్రచురించారు.

నేడు 38వ వార్షికోత్సవం

మంజీరా రచయితల సంఘం ఏర్పాటై 38 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నేడు (ఆదివారం) సిద్దిపేటలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీనికి విపంచి ఆడిటోరియం వేదిక కానుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు, ప్రముఖ కవి శివారెడ్డి, ధూంధాం వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే బాలకిషన్, ప్రముఖ కవి సిద్దెంకి యాదగిరి హాజరు కానున్నారు. అలాగే దాశరథి, ఆరుద్ర, బిరుదురాజురామరాజుల శతజయంతి వేడుకల సందర్భంగా ఆరుద్ర సాహితీ స్ఫూర్తిపై నందిని సిధారెడ్డి, దాశరథి కవితా చైతన్యం పై కవి, గాయకుడు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, రామరాజు జానపదం గురించి కవి కాశీంలు ప్రసంగించనున్నారు. సాయంత్రం కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. కవులు, రచయితలు పెద్ద ఎత్తున హాజరు కానున్నారు.

మంజీరా రచయితల సంఘం లోగో

సామాజిక రుగ్మతలపై పోరాటం



ఉమ్మడి మెదక్ జిల్లాలో సాహిత్యరంగంలో మరసం గొప్ప పాత్ర నిర్వహిస్తుంది. అనేక మంది అభ్యుదయ వాదులు, కవులను ఏకం చేసి సామాజిక రుగ్మతలపై ప్రత్యేక పోరాటం చేసింది. మెదక్ సామాజిక ఉద్యమాలతో కలిసి నడిచి అండగా నిలిచింది. ప్రజా చైతన్యాన్ని నిర్మించే దిశగా అనేక ర్యాలీలు, చర్చ గోష్ఠిలు నిర్వహించాం.

– కె.రంగాచారి, అధ్యక్షుడు, మంజీరా రచయితల సంఘం

ఒక్క తాటిపైకి తీసుకొచ్చాం



జిల్లాలో వివిధ భావాలు కలిగిన రచయితలను ఒక్కతాటిపైకి తెచ్చాం. సాంప్రదాయ సాహిత్య పరమావధిగా ఉన్న దశ నుంచి ఆధునిక సాహిత్యానికి వేదిక మలిచాం. ఆధునిక సాహిత్యంలో ఉన్న వివిధ దశలను పాటలు, కవితలు, కథ ప్రజల జీవితంతో నింపి ప్రజలకు చేరువచేయడం జరిగింది. 38 ఏళ్లుగా అందరం కలిసికట్టుగా ముందుకు సాగుతున్నాం.

– నందిని సిధారెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు, మంజీరా రచయితల సంఘం



సదస్సులో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

తెలంగాణ ఉద్యమంలోనూ కీలకపాత్ర

తెలంగాణ ఉద్యమంలో కవులు, రచయితలు కీలకంగా వ్యవహరించారు. 24 నవంబర్ 1996లో సిద్దిపేటలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర డిమాండ్ పై మైత్రీ సమావేశాన్ని నిర్వహించారు. 17 ఆగస్టు 1997న సిద్దిపేట బాలికల జూనియర్ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ప్రత్యేక సదస్సును ఏర్పాటు చేశారు. తెలంగాణ భాష, యాసలో కవిత్వాన్ని పాటలను రచించింది. కోమల్ అనే కలం పేరుతో కవి, రచయిత, సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి తెలంగాణ పాటలను రచించారు. నాగేటి సాల్లల్లో నా తెలంగాణ పాటను కవి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పాడారు. తెలంగాణ ప్రాంత కవులు, రచయితలను ఏకం చేయాలని ఉద్దేశ్యంతో 14 అక్టోబర్ 2001న తెలంగాణ రచయితల వేదికను ప్రారంభించింది. మొట్టమొదటి సభను సిద్దిపేటలో నిర్వహించారు. తెలంగాణ ఉద్యమానికి సాహిత్య, సాంస్కృతిక రంగంలో నూతన ఒరవడికి నాంది పలికింది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ రచయితలు, కవులు ముఖ్య భూమిక పోషించారు.

రూ.4.50 లక్షలు రికవరీ

- 19న బస్సులోంచి డబ్బుల బ్యాగు ఎత్తుకెళ్లిన మహిళ

కౌడిపల్లి(నర్సాపూర్): బస్సులో పోయిన నగదును పోలీసులు పట్టుకొని బాధితులకు అప్పగించారు. శనివారం ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కామారెడ్డి జిల్లా గోపాల్‌పేటకు చెందిన మహ్మద్‌షఫీ 19న హైదరాబాద్ షాపూర్‌నగర్‌లోని బంధువుల వద్ద రూ 4.50 లక్షలు అప్పు తీసుకున్నాడు. నగదును బట్టల బ్యాగ్‌లో పెట్టుకొని బాన్స్‌వాడ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్‌లో గోపాల్‌పేటకు వస్తున్నాడు. బస్ కౌడిపల్లికి వచ్చాక బ్యాగ్ కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బస్సులోనే ఓ మహిళా ప్రయాణికురాలు తీసుకెళ్లినట్లు బాధితుల చెప్పిన ఆనవాళ్ల ప్రకారం కౌడిపల్లి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డితోపాటు స్థానిక పోలీసులు, మెదక్ క్రైమ్, సాంకేతిక విభాగ బృందం సీసీ కెమెరాలను పరిశీలించి దర్యాప్తు ముమ్మరం చేశారు. కొల్చారం మండలం పోతిరెడ్డిపల్లి తండాకు చెందిన మహిళను శుక్రవారం అదుపులోకి తీసుకొని విచారించి రూ.4.50 లక్షలతోపాటు బ్యాగ్‌ను రికవరీ చేశారు. శనివారం నర్సాపూర్ కోర్టులో లోక్ అదాలత్ ద్వారా బాధితులకు డబ్బులు అప్పగించారు.

క్రీడలతో మానసికోల్లాసం

- అటవీశాఖ సీసీఎఫ్ శరవణన్



జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభిస్తున్న సీసీఎఫ్ శరవణన్

సిద్దిపేటజోన్: క్రీడలు ప్రతీ ఒక్కరి శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని అటవీశాఖ సీసీఎఫ్ శరవణన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని స్టేడియంలో రాజన్న సర్కిల్ పరిధిలోని ఆయా జిల్లాల అటవీశాఖ ఉద్యోగుల జోనల్ క్రీడలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అటవీశాఖ ఉద్యోగులు విధి నిర్వహణలో పని ఒత్తిడి కల్గి ఉంటారని, అప్పుడప్పుడూ ఈలాంటి క్రీడలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఆటల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ఆడాలని సూచించారు. రెండు రోజులపాటు జరుగనున్న క్రీడల్లో సిద్దిపేట, కామారెడ్డి, కరీంనగర్, మెదక్, సిరిసిల్ల జిల్లాల్లోని అటవీశాఖ ఉద్యోగులు పాల్గొననున్నారు. వాలీబాల్, కబడ్డీ, షటిల్ టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ క్రీడల్లో సుమారు 200 ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట, కరీంనగర్, కామారెడ్డి, మెదక్ డీఎఫ్‌ఓలు శ్రీనివాస్, బాలమని, నికిత, జోజి పాల్గొన్నారు.

రాజీపడే కేసులకు లోక్ అదాలత్ వేదిక

- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సౌమ్య
- 1,406 కేసులు పరిష్కారం



హుస్నాబాద్ రూరల్ :మాట్లాడుతున్న జడ్జి శివరంజని

గజ్వేల్‌రూరల్: రాజీపడదగిన కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కని వేదికని మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, గజ్వేల్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సౌమ్య పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా గజ్వేల్‌లోని కోర్టులో శనివారం రాజీపడదగిన క్రిమినల్, బ్యాంకు తదితర మొత్తం 1,406 కేసులను పరిష్కరించారు. ఈ సందర్భగా జడ్జి సౌమ్య మాట్లాడుతూ.. చిన్న చిన్న సమస్యలతో కక్షలు పెంచుకోవద్దన్నారు. ఒకరిపై మరొకరు కేసులు పెట్టుకోవడం వల్ల విలువైన కాలంతోపాటు డబ్బు వృథా అవుతుందన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయసుధ, న్యాయవాదులు, జిల్లా బాలల సంక్షేమ సమితీ సభ్యులు దేశబోయిన నర్సింలు, వివిధ బ్యాంకు మేనేజర్లు, మండల లీగల్ సర్వీస్ సిబ్బంది నర్సింహచారి, యామిని, కోర్టు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

701 కేసులు..

హుస్నాబాద్‌రూరల్: గృహ హింసలు, మద్యం సేవించిన కేసులకు కోర్టుల చుట్టూ తిరిగి సమయం వృథా చేసుకోవద్దని హుస్నాబాద్ మున్సిఫ్ కోర్టు జడ్జి శివరంజని అన్నారు. శనివారం కోర్టులో మెగా లోక్ అదాలత్ నిర్వహించి 701 కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి శివరంజని మాట్లాడుతూ.. సాక్ష్యాధారాలను పరిగణలోకి తీసుకొని కోర్టు తీర్పులు ఉంటాయని, కోర్టు తీర్పు ఆలస్యమైతే కక్షిదారులు, న్యాయవాదులు, న్యాయమూర్తులు సహితం మానసిక ఒత్తిడికి లోనవుతారని తెలిపారు. న్యాయస్థానాలు కల్పించే అవకాశాలను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

675 కేసులు..

దుబ్బాకటౌన్: దుబ్బాక జూనియర్ సివిల్ జడ్జి వేముగంటి తరణి ఆధ్వర్యంలో శనివారం కోర్టు ఆవరణలో లోక్ ఆదాలత్ నిర్వహించారు. దుబ్బాక ఎస్‌బీఐలో లోన్ తీసుకొని వన్ టైమ్ సెటిల్మెంట్ ద్వారా 14 కేసులకు పరిష్కారం లభించింది. 67 క్రిమినల్ కేసులు, 27 ఒప్పందం చేసుకున్నవి, డ్రంకెన్ డ్రైవ్ 256, పెట్టి కేసులు 325 కలుపుకొని మొత్తం 675 కేసులకు పరిష్కారం లభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐలు గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలి

- డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేశ్ కుమార్



మాట్లాడుతున్న రమేశ్ కుమార్

కొల్చారం(నర్సాపూర్): రేషన్ కార్డుతో సంబంధం లేకుండా, పట్టాదారు పాసు పుస్తకం ఉన్న ప్రతీ రైతుకు రూ.2 లక్షల లోపు రుణమాఫీ వర్తింజేయాలని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేశ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన అధ్యక్షతన శనివారం మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో మహాజన సభ నిర్వహించారు. మహాసభను ఉద్దేశించి సంఘం సీఈవో నవీన్ ప్రాథమిక నివేదికను సభలో చదివి వినిపించారు. రుణాల కోసం సంఘం డైరెక్టర్ల వద్దకు వెళ్లకుండా, డైరెక్టర్లనే సహకార సంఘానికి పిలిపించి డాక్యుమెంట్లపై సంతకాలు చేయించాలని రైతులు సభా దృష్టికి తీసుకొచ్చారు. రంగంపేట, ఎనగండ్ల గ్రామాల్లో సహకార సంఘానికి విలువైన భూములు ఉన్నాయని వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. అనంతరం రమేశ్ కుమార్ మాట్లాడుతూ.. తాము సంఘం బాధ్యతలు చేపట్టిన మొదట్లో రైతులకు రూ.కోటి వరకు రుణాలు అందించామని, ప్రస్తుతం రూ.6 కోట్ల వరకు రుణాలు అందించామన్నారు. రైతుల సమక్షంలో ప్రతీ రైతుకు రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలంటూ తీర్మానం చేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు మల్లేశం, డైరెక్టర్లు రమేశ్, దుర్గేశ్, ప్రవీణ్ రెడ్డి, జనార్దన్ గౌడ్, సాయిలు, ఆకుల రమేశ్, సంగమేశ్వర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కిందపడి వ్యక్తి మృతి

తూప్రాన్: మద్యం మత్తులో కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఇస్లాంపూర్‌లో చోటు చేసుకుంది. శనివారం ఎస్‌ఐ శివానందం కథనం మేరకు.. శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామానికి చెందిన అంసానిపల్లి శ్రీనివాస్‌రెడ్డి(53) తూప్రాన్ మండలం ఇస్లాంపూర్‌లో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నాడు. మద్యానికి బానిసై 25న అతిగా తాగడంతో కిందపడి తీవ్ర గాయాలు పాలయ్యాడు. మళ్లీ ఇంటి నుంచి బయటకు వెళ్లి అతిగా మద్యం సేవించి శనివారం తూప్రాన్ పట్టణంలో రోడ్డు పక్కన కిందపడి మృతి కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తండ్రి మృతిపై ఎలాంటి అనుమానం లేదని కుమారుడు వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రాణహాని ఉందన్నా పట్టించుకోవడం లేదు



ఫిర్యాదు చూపుతున్న లక్ష్మి

నర్సాపూర్ : తనపై హత్యాయత్నం జరిగిన కేసులో నిందితులను పోలీసులు పట్టుకోవడం లేదని, తనకు వారి నుంచి ప్రాణహాని ఉందని మండలంలోని చిన్న చింతకుంటకు చెందిన బుర్ర లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఆగస్టు 6న ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి మంచంపై పెట్రోలు పోసి నిప్పంటించాడని తెలిపారు. ఇదే విషయంపై మరుసటి రోజు నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై స్థానిక సీఐ జాన్ రెడ్డిని వివరణ కోరగా బుర్ర లక్ష్మి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

యువతి అదృశ్యం



జయలక్ష్మి(ఫైల్)

వర్గల్(గజ్వేల్): యువతి అదృశ్యమైన ఘటన మండల కేంద్రం వర్గల్‌లో చోటు చేసుకుంది. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం సంగినేనిపల్లికి చెందిన వడ్డె కిష్టయ్య మూడు నెలల కిందట ఉపాధి నిమిత్తం భార్య, ఇద్దరు పిల్లలతో వర్గల్‌కు వచ్చారు. ఇక్కడే ఐస్‌క్రీమ్ కంపెనీలో పనిచేస్తూ గుడిసెలో ఉంటున్నారు. శుక్రవారం కిష్టయ్య దంపతులు పనికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి రాగా కూతురు జయలక్ష్మి(18) కనిపించలేదు. చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటి నుంచి బయటకు వెళ్లి వివాహిత

పటాన్‌చెరు టౌన్: వివాహిత అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు చెందిన మంగ్యా నాయక్ మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడి భార్య జయ 24న సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం భర్త ఫిర్యాదు మేరకు పోలీసు కేసు నమోదు చేశారు.

రైతును మభ్యపెట్టి ఏటీఎం కార్డు చోరీ

- రూ.71 వేలు డ్రా చేసిన అగంతకులు
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

రామాయంపేట(మెదక్): ఓ రైతును మభ్యపెట్టి ఏటీఎం కార్డు అపహరించిన ముగ్గురు దుండగులు ఖాతాలోని నగదును డ్రా చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కాట్రియాలకు చెందిన కొప్పుల రైతు రాజయ్య డబ్బులు డ్రా చేయడానికి శుక్రవారం స్థానికంగా ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు వెళ్లాడు. అతడి వెనుక నుంచే ఏటీఎంలోకి గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు వచ్చారు. రైతును మభ్యపెట్టి ఏటీఎం కార్డును అపహరించి వారి కార్డును ఇచ్చారు. డబ్బులు రాకపోవడంతో వెనుదిరిగిన రాజయ్యకు రాత్రి రెండు విడతలుగా రూ.71 వేలు డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. ఆందోళన చెందిన అతడు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీసీ ఫుటేజీ పరిశీలించిన ఎస్‌ఐ బాల్‌రాజు కేసు నమోదు చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

చిన్నశంకరంపేట(మెదక్): తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన తాళ్ల శ్రీనివాస్‌గౌడ్ 26న ఇంటికి తాళం వేసి బంధువుల ఊరికి వెళ్లాడు. అదే రోజు అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి 8 తులాల బంగారం, రూ.50 వేల నగదు ఎత్తుకెళ్లారు. శనివారం ఊరి నుంచి వచ్చి చూడగా వేసిన తాళం వేసినట్లే ఉండి, ఇంట్లోని బీరువాలో నగదు బంగారం కనిపించలేదు. దొంగలు పడ్డారని గుర్తించి పోలీస్‌లకు ఫిర్యాదు చేయగా ఏఎస్‌ఐ శంకర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రేషనలైజేషన్ జీవోను సవరించాలి

- కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయ సంఘాల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

మెదక్ కలెక్టరేట్: అశాస్త్రీయమైన సర్దుబాటు జీఓ 25ను సవరించాలని, దీని వల్ల ప్రభుత్వ పాఠశాలలు మూత పడే పరిస్థితి నెలకొందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రభుత్వంపై మండిపడ్డారు. శనివారం మెదక్ సమీకృత కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. అశాస్త్రీయమైన సర్దుబాటు జీఓ 25ను సవరించాలని, అంతకు ముందే బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేయాలని డిమాండ్‌చేశారు. 11 మంది విద్యార్థులు ఉన్న చోట ఇద్దరు టీచర్లు, 60 ఉపాధ్యాయులు ఉన్న చోట కూడా ఇద్దరు టీచర్లనే ఉంచాలనడం అసంబద్ధమన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ప్రాథమిక పాఠశాలలు మూతపడే ప్రమాదం ఉందని వాపోయారు. కార్యక్రమంలో జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకులు శ్రీనివాసరావు, పద్మారావు, రవీందర్ రెడ్డి, సంగయ్య, యాదగిరి, భీమ్లా నాయక్, హిరాలాల్, సీతల్ సింగ్, షాకిర్ అలీ, ప్రేమ్ కుమార్, శీతల్ సింగ్ పేరు సింగ్ నాగరాజు సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు ఇవ్వకపోతే హైడ్రా అధికారులకు చెబుతా..

- జనంసాక్షి విలేకరి డిమాండ్
- స్తంభానికి కట్టేసి కొట్టిన ఐలాపూర్‌వాసులు
- నిందితుడిని పోలీసులకు అప్పగింత



సంతోష్‌ను స్తంభానికి కట్టేసిన స్థానికులు

పటాన్‌చెరు టౌన్: ఇళ్ల నిర్మాణం విషయంలో డబ్బులు ఇవ్వకపోతే హైడ్రా అధికారులకు చెప్పి కూల్చి వేయిస్తానని బెదిరించిన ఓ విలేకరిని స్థానికులు స్తంభానికి కట్టేసి కొట్టారు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఐలాపూర్ గతంలో గ్రామ పంచాయతీగా ఉండేది. ఇటీవల అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనం అయింది. అప్పట్లో గ్రామ పంచాయతీ కార్యదర్శి ద్వారా ఇంటి నంబర్లు తీసుకోగా ఇంకా ఇళ్ల నిర్మాణంలోనే ఉన్నాయి. ఈ ఇళ్ల వద్దకు శనివారం అమీన్‌పూర్ జనంసాక్షి విలేకరి సంతోష్ నాయక్ వెళ్లి వీటికి మున్సిపాలిటీ పర్మిషన్ లేదని, ఇళ్ల ఫొటోలు తీస్తూ డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. లేకుంటే హైడ్రా అధికారులతో చెప్పి కూల్చి వేయిస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో కోపోద్రిక్తులైన స్థానికులు.. సంతోష్ నాయక్‌ను స్తంభానికి కట్టేసి కొట్టారు. అనంతరం అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి జరిగిన ఘటన సీఐకు వివరించారు. కేసు దర్యాప్తులో ఉంది.